
## నేటి నుంచి 14 వరకు డ్రగ్స్ స్పెషల్ డ్రైవ్


సిటీబ్యూరో, మే 7(నమస్తే తెలంగాణ): యువత, ప్రజలకు ప్రాణాంతకంగా మారిన గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిస్థాయిలో అరికట్టడంలో భాగంగా ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు మత్తు పదార్థాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం వెల్లడించారు. బుధవారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ఎస్టీఎఫ్ బృందాలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి ఈనెల 14వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న స్పెషల్ డ్రైవ్‌లో ఎస్టీఎఫ్ బృందాలతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్, ఎక్సైజ్ యంత్రాంగం సైతం పాల్గొనాలని ఆదేశించారు. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని నగరంలో గంజాయి, డ్రగ్స్ మూలాలను రూపుమాపడానికి ఆబ్కారీ శాఖకు చెందిన ప్రతి ఒక్కరూ శక్తివంచనలేకుండా పనిచేయాలన్నారు. మత్తు మాఫియాలపై కఠినంగా వ్యవహరిస్తూ డ్రగ్స్ మూలాలను రూపుమాపడానికి ప్రతిఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. గత సంవత్సరం జనవరి, జూన్ , సెప్టెంబర్ నెలల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 383 కేసులు నమోదు చేసి, 644 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 2639 కిలోల గంజాయి, 99.23 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, 6.33కిలోల ఆల్ఫ్రజోలంను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించారు.

నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, గురువారం 8 మే 2025 VIKARABAD



పాకిస్థాన్ ఉగ్రవాదుల స్థావరాలపై భారత ఆర్మీ మంగళ వారం రాత్రి చేసిన మెరుపు దాడులను స్వాగతిస్తూ మొయినాబాద్ మున్సిపాలిటీ చిలుకూరులో యువత బాణాసంచా కాలుస్తూ స్వీట్లు పంచుకుంటూ భారత్ మాతాకీ జై.. అంటూ ర్యాలీ నిర్వహించారు.





## బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నవాబుపేట, మే 7: నవాబుపేట మండల పరిధిలోని ఏక్‌మామిడి గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు భారీ సంఖ్యలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందరం కలిసికట్టుగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. పార్టీలో చేరిన వారితో పాటు బీఆర్ఎస్ మండల గౌరవ అధ్యక్షుడు పట్లోళ్ల భరత్‌రెడ్డి, సలహాదారు మందుల విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్లు పురుషోత్తంచారి, శాంతికుమార్, ప్రచార కార్యదర్శి ఆసిరెడ్డిగారి వెంకట్‌రెడ్డి, యూత్ వైస్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# హమాలీల కొరత.. రైతు నిరీక్షణ



ధాన్యం కొనుగోలు కేంద్రానికి వస్తున్న ధాన్యం

### ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతు వేదన

- పట్టించుకోని ప్రభుత్వం
- జాప్యంతో వర్షానికి తడుస్తున్న ధాన్యం
- కుప్పల వద్ద రైతుల పడిగాపులు
- జిల్లా వ్యాప్తంగా 33 కొనుగోలు కేంద్రాలు



కొనుగోలు కేంద్రాల్లో మూలుగుతున్న వరి ధాన్యం కుప్పలు

రంగారెడ్డి, మే 7(నమస్తేతెలంగాణ):రంగారెడ్డి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను హమాలీల కొరత వెంటాడుతున్నది. కొనుగోలు కేంద్రాలకు పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నప్పటికీ హమాలీల కొరతతో రోజుల తరబడి కేంద్రాల వద్దే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. హమాలీలు దొరికే వరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల బయటనే ఉంచుతుండటంతో వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నది. ఈ పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల్లోనూ నెలకొన్నది. ముఖ్యంగా జిల్లాలోని హమాలీలంతా బీహార్ ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉన్నారు. ధాన్యం కొనుగోలు సీజన్ అధికం కావడంతో హమాలీలంతా రైస్ మిల్లుల వైపు వెళ్తున్నారు. దీంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రావడానికి మొగ్గు చూపడంలేదు. దీంతో అదనంగా హమాలీలు దొరకటం ఇబ్బందికరంగా మారింది.

### పోటెత్తుతున్న ధాన్యం

జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు రైతులు తాము పండించిన ధాన్యాన్ని పెద్దఎత్తున విక్రయించటానికి తీసుకువస్తున్నారు. అధికారులు నిర్ణయించిన లక్ష్యానికంటే ఎక్కువ ధాన్యం వచ్చే అవకాశాలున్నాయి. ఈ యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. అంచనాకు మించి ధాన్యం దిగుబడులు రావడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు బారులు తీరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతోపాటు బోనస్ కూడా వస్తుందని రైతులు ధాన్యాన్ని తీసుకువస్తున్నారు.

### హమాలీలంతా రైస్ మిల్లులకే..

జిల్లాలోని శివారు ప్రాంతాల్లో పెద్దఎత్తున రైస్‌మిల్లులు ఏర్పాటు చేశారు. నగరంలో ఉన్న రైస్‌మిల్లు కూడా శివారు ప్రాంతాలకు తరలించారు. దీంతో బీహార్, ఇతర రాష్ట్రాలకు చెందిన హమాలీలంతా రైస్ మిల్లుల్లోనే పని చేస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీల కొరత ఏర్పడింది. రైస్‌మిల్లుల్లో పర్మినెంట్‌గా పనులు దొరుకుతుండటంతో తాత్కాలిక కొనుగోలు కేంద్రాలకు వెళ్లటానికి ఇష్టపడటంలేదు.

### జిల్లాలో 33 కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో డీసీఎంఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో 33 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాలకు పెద్దఎత్తున ధాన్యం వస్తున్నది. ఈ ధాన్యాన్ని సకాలంలో నింపటానికి హమాలీలు దొరకడంలేదు. హమాలీలు వచ్చే వరకు రోజుల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొనుగోలు కేంద్రాల ముందు ధాన్యాన్ని ఉంచి రైతులు వెళ్లిపోతున్నారు.అకాల వర్షాలు రాత్రిపూట వస్తుండటంతో ధాన్యం రాశులు, బస్తాలు పూర్తిగా తడిసిపోతున్నాయి. తెల్లారి ధాన్యాన్ని మళ్లీ ఆరబోసుకునే పరిస్థితి ఏర్పడుతున్నది. కొన్ని ప్రాంతాల్లో రైతులే హమాలీలను తీసుకువచ్చే పరిస్థితి ఏర్పడింది.

### హమాలీలను ఏర్పాటు చేయాలి



కొనుగోలు కేంద్రాల్లో హమాలీలు లేక ధాన్యం ఇక్కడే మూలుగుతున్నది. ఉదయం వచ్చి ధాన్యం ఎండబోసి పోతున్నాం. రాత్రి వర్షం వచ్చి ధాన్యం తడిసి పోతున్నది. వెంటనే ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీలను ఏర్పాటు చేసి రైతులను కాపాడాలి.

– పద్మ, మహిళా రైతు

## చేవెళ్ల కాంగ్రెస్‌లో నిరసన సెగ..




రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డికి విన్నవిస్తున్న నాయకులు, కార్యకర్తలు

- భీం భరత్ వర్గానికి ఇందిరమ్మ ఇండ్ల కమిటీలో మొండి చేయి
- ఎమ్మెల్యే యాదయ్య అనుచర వర్గానికే మొగ్గు చూపారని మండిపాటు

చేవెళ్ల రూరల్, మే 7 : చేవెళ్ల కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరుతున్నది. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లో చేరారు.తనకు ప్రత్యర్థిగా ఉన్న నియోజకవర్గ భీంభరత్ యాదయ్య కాంగ్రెస్‌లోకి వచ్చిన తర్వాత ఇద్దరి మధ్య సఖ్యత కుదరక రెండు వర్గాలుగా విడిపోయినట్టు స్థానికంగా చర్చ జరుగుతున్నది.. తాజాగా బుధవారం చేవెళ్ల మున్సిపల్ పరిధి ఇబ్రహీంపల్లి వార్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ శివసేన రెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ గుత్తా అమిత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య రాకపోవడం గమనార్హం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్ వర్గం మాత్రమే హాజరైంది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలో భీం భరత్ వర్గానికి స్థానం ఇవ్వలేదని, ఎమ్మెల్యే అనుచరులు, బీజేపీ నాయకులకే కమిటీలో ఉన్నారని పలువురు నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు అవకాశాలు, సరైన గుర్తింపు ఇవ్వడం లేదని మండిపడ్డారు. మీరు చెప్పిన ప్రతి అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి కష్టపడిన వారిని గుర్తిస్తామని వారిని శాంతింపజేశారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో అంతర్గత కలహాలు ఎప్పటికప్పుడు బయటపడుతూనే ఉన్నాయి. ఏదేమైనా స్థానిక ఎమ్మెల్యేను పక్కన పెట్టి నియోజకవర్గ ఇన్‌చార్జితో మీటింగ్ ఏర్పాటు చేయడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# బీమా కోసం ఎదురుచూపులు





- రైతు బీమా సాయం అందక నెలల తరబడి వేచిచూస్తున్న రైతు కుటుంబీకులు
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాయం అందించడంలో ఆలస్యం
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వారం రోజుల్లోనే బ్యాంకు ఖాతాల్లో బీమా సొమ్ము జమ
- నెలలు గడిచినా సాయం అందక కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న బాధిత రైతు కుటుంబాలు
- క్షేత్రస్థాయిలో సాయం కోసం అధికారులను నిలదీస్తున్న వైనం
- బీఆర్ఎస్ హయాంలో రూ.213 కోట్ల పరిహారం అందజేత
- కేసీఆర్ సర్కార్‌లో 4,262 మంది రైతు కుటుంబాలకు అందిన ఆర్థిక సాయం

వికారాబాద్, మే 7(నమస్తే తెలంగాణ): మోసపూరిత హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. పెట్టుబడి సాయాన్ని పెంచుతామని, పంట రుణాలను మాఫీ చేస్తామంటూ హామీలనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచింది. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల కాలంలో రైతుల ఆర్థిక స్థితిగతులు వృద్ధి చెందితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరకే రైతన్నలు అప్పుల్లో కూరుకుపోయిన పరిస్థితులు నెలకొన్నాయి. అదేవిధంగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎక్కడైనా రైతు మృతి చెందితే సంబంధిత కుటుంబం రోడ్డున పడకుండా బాధిత కుటుంబానికి అండగా నిలిచి భరోసా కల్పించేందుకుగాను కేసీఆర్ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన రైతు బీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నీరుగారుస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు ఏ విధంగా మృతి చెందినా సంబంధిత రైతు కుటుంబాన్ని ఆదుకునేందుకుగాను కేవలం వారం రోజుల్లో ఆ రైతు కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో రూ.5 లక్షల బీమా సాయాన్ని జమ చేసేవారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమల్లోకి తీసుకువచ్చిన ఒకట్రెండు పథకాలకు కొర్రీలు పెట్టి అర్హుల్లో సగం మందికి అన్యాయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తున్నది. రైతు బీమా సాయం కోసం మృతి చెందిన రైతు కుటుంబ సభ్యులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ హయాంలో వారంరోజుల్లో బీమా సాయం మృతి చెందిన రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బీమా సాయం ఎప్పుడు వస్తుందంటూ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులున్నాయి. అదేవిధంగా నెలల తరబడి రైతు బీమా ఆర్థిక సాయం అందకపోవడంతో క్షేత్రస్థాయిలో అధికారులను సైతం బాధిత కుటుంబాలు నిలదీస్తుండడం గమనార్హం. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 838 మంది రైతులు వివిధ కారణాలతో మృతి చెందగా, వీరిలో చాలామంది మంది రైతులు గత కొన్ని నెలలుగా రైతు బీమా సాయం కోసం ఎదురుచూస్తున్నారు.


### బీఆర్ఎస్ హయాంలో రూ.213 కోట్ల సాయం అందజేత

రైతులు అప్పుల ఊబిలో చిక్కుకోకుండా పంటలను సాగు చేసేందుకు పెట్టుబడి సాయం అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చి, రైతు ఆత్మహత్యలను నివారించేందుకుగాను ఏదేని రైతు మరణిస్తే సంబంధిత రైతు కుటుంబాన్ని ఆదుకునేందుకుగాను రూ.5 లక్షల సాయాన్ని అందజేసేందుకుగాను రైతుబీమా పథకాన్ని తీసుకువచ్చింది. జిల్లాలో బీఆర్ఎస్ హయాంలో 4,262 మంది రైతులు మరణించగా, సంబంధిత రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.213.10 కోట్లను మృతి చెందిన రైతు కుటుంబ సభ్యులకు పరిహారాన్ని అందజేశారు. అయితే మృతి చెందిన రైతు కుటుంబసభ్యులకు తొలుత రూ.5 లక్షల బీమా డబ్బును బాండ్ల రూపంలో అందజేసిన గత ప్రభుత్వం తదనంతరం నేరుగా సంబంధిత రైతు కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో 786 మంది రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.39.30 కోట్లు, 2019–20 ఆర్థిక సంవత్సరంలో 812 మంది అర్హులుగా గుర్తించి రూ.40.60 కోట్ల సొమ్మును సంబంధిత రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. అదేవిధంగా 2020–21 ఆర్థిక సంవత్సరంలో 1201 కుటుంబాలకు రూ.60.05 కోట్లు, 2021–22 ఆర్థిక సంవత్సరంలో 1047 కుటుంబాలకు రూ.52.35 కోట్లు, 2022–23 ఆర్థిక సంవత్సరంలో 416 మంది రైతులు మృతి చెందగా, సంబంధిత రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.20.80 కోట్ల బీమా సాయాన్ని నేరుగా సంబంధిత రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

# గ్రీన్‌ఫీల్డ్..మాకొద్దు..

### ముందు సమాచారం లేకుండా గ్రామసభలు ఎందుకు?

### రావిర్యాలలో గ్రామసభను బహిష్కరిస్తూ తీర్మానం చేసిన రోడ్డు భూ బాధితులు



గ్రామసభలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

ఆదిబట్ల, మే 7: ముందు సమాచారం లేకుండా గ్రామసభను ఎలా నిర్వహిస్తారని, గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుతో మాలాంటి పేద రైతులకు ఏం లాభం అని గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు అధికారులను నిలదీశారు. బుధవారం మహేశ్వరం మండల పరిధిలోని రావిర్యాల గ్రామంలో కొంగరఖుర్దు రెవెన్యూలో గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ అధికారి రాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు ఎంతో ఆవేదనతో అధికారులను నిలదీశారు. రాత్రి అందరూ పడుకున్న తరువాత టాం టాం వేయించి తెల్లవారేసరికి ఎవరికి సమాచారం లేకుండానే గ్రామసభలు నిర్వహించడం ఏంటని భూసేకరణ అధికారిని రైతులు నిలదీశారు. ఒకే సర్వే నంబర్‌లో రెండుసార్లు ప్రభుత్వం భూమిని సేకరించడం ఏంటన్నారు. దీంతో కాసేపు రైతులకు సమాధానం చెప్పలేక భూసేకరణ అధికారి రాజు కాసేపు అయోమయానికి గురయ్యాడు. దీంతో దాదాపు 30 మంది రైతులు గ్రామసభను బహిష్కరిస్తూ తీర్మానం చేసిన కాపీని భూసేకరణ అధికారికి అందజేసి రైతులు గ్రామసభ నుంచి వెళ్లి పోయారు. దీంతో అక్కడ ఉన్న కొంత మందితో గ్రామ సభను నిర్వహించారు.

గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు ఏర్పాటులో భూములు కోల్పోతున్న భూముల్లో ఉన్న రైతులకు టైటిల్ డీడ్ తప్పనిసరి. కేవలం కబ్జాలో ఉంటే వారికి నష్ట పరిహారం ఇవ్వడం జరగదని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గ్రామ సభకు విచ్చేసి మాట్లాడారు. రోడ్డు ఏర్పాటులో 100 శాతం భూములు కోల్పోతూ పూర్తిగా ఆ భూమిపై ఆధారపడి జీవిస్తున్న రైతుల కుటుంబాలకు ఆ కుటుంబంలోని 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.5లక్షల 50 వేలను ప్రభుత్వం ఇవ్వడానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. త్వరలోరనే రోడ్డు ఏర్పాటులో భూములు కోల్పోతున్న భూములకు ఎంత ధర చెల్లించాలో ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. ఇప్పటికి రోడ్డు ఏర్పాటులో 42 మంది రైతులకు చెందిన 54 ఎకరాల 33 గుంటల భూమి సేకరించడం జరిగిందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

మిగతా IVవ పేజీలో..